మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

మంగళవారం 17-03-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 147

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



## ఏపీలో పదోతరగతి
# పరీక్షలు ప్రారంభం

- గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- అర గంట ముందుగానే లోపలికి అనుమతి
- క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతి
- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

అమరావతి,
ఎపిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం నాడు ప్రారంభం అయ్యాయి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యా శాఖ అధికారులు సూచించడంతో గంట ముందుగానే విద్యార్ధులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్ధులను వారి తల్లి తండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు వెంట వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చారు. బస్సులో,

-మిగతా 3 లో





## పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ
# ఓ చరిత్ర

### స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం

- అహింసా మార్గంలో ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి
- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం
- అమరావతిలో ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

అమరావతి,
అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఒక చరిత్ర అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం చేశామని చెప్పారు. అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో అమరజీవి పొట్టి శ్రీరాముల 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, టీజీ భరత్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

-మిగతా 3 లో





# ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

- దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి
- ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు

టెహ్రాన్,
ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీస్

-మిగతా 3 లో



# గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

- తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మొహరింపు

తైపీ,
గల్ఫ్ యుద్ధంతో అంతా అటువైపు దృష్టి పెట్టగా చైనా మరోమారు తైవాన్‌పై దృష్టి సారించింది. గత రెండు వారాలుగా కొంత నిశ్శబ్దంగా ఉన్న చైనా సైన్యం.. మళ్ళీ తైవాన్ సరిహద్దుల్లో తన ప్రాబల్యాన్ని చాటుకోవడం మొదలుపెట్టింది. తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత 24 గంటల్లో భారీ సంఖ్యలో ,

-మిగతా 3 లో




# అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉంది

- గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తాం
- వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ,
వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని తెలిపింది. హర్మూజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉందని కేంద్రం వెల్లడించింది. కాగా, ఖతార్ నుండి లిక్విడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. హాస్టల్స్ మెనూను పూర్తిగా మార్చేశాయి.

-మిగతా 3 లో



# ట్రంప్‌కు షాక్

- హార్మూజ్‌కు నౌకలు పంపించబోమన్న ఆస్ట్రేలియా, జపాన్
- దౌత్యమే పరిష్కారమన్న ఇటలీ
- సైనిక కార్యకలాపాలు నిలిపివేయాలన్న చైనా
- శత్రువులకే మూసివేశామన్న ఇరాన్

వాషింగ్టన్
అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు చుక్కెదురైంది. అంతర్జాతీయ చమురు సరఫరాకు ప్రధాన రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధి మీదుగా రవాణా సాగేందుకు బల ప్రదర్శన చేయాలన్న ట్రంప్ ప్రతిపాదనలను మిత్రపక్షాలే తిరస్కరించాయి. పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న భీకర దాడులు, ఇరాన్ ప్రతిఘటనతో చమురు రవాణా సంక్షోభంలో పడటంతో, ట్రంప్ మిత్రపక్షాల సహాయాన్ని కోరుతున్నారు. ట్రంప్ పిలుపును మిత్ర దేశాలు ఆస్ట్రేలియా, జపాన్‌లు తిరస్కరించాయి. తాము యుద్ధ నౌకలను అక్కడకు పంపలేమని స్పష్టం చేశాయి. ఈ అంశంపై ముందు అమెరికాతో చర్చలు జరపాల్సి వుందని దక్షిణ కొరియా పేర్కొంది. ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటానియో తజాని మాట్లాడుతూ, హార్మూజ్‌లో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించాలంటే దౌత్యమే సరైన మార్గమని బ్రస్సెల్స్‌లో విలేకర్లతో మాట్లాడుతూ

-మిగతా 3 లో

## చంద్రబాబు నాయకత్వంలోనే
# మైనారిటీల సంక్షేమం

### రూ.6000 కోట్లు పైగా కేటాయించిన రాష్ట్రం ఏపీనే

- గత ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమం సున్నా
- కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన్ లను పూర్తి చేయని గత ప్రభుత్వం
- రాష్ట్రస్థాయి ఇఫ్తార్ విందు సమావేశంలో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

అమరావతి,మార్చి 16 డ్రీమ్ టైమ్స్:
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి నేటి వరకు ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యలతో కూడిన సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం విజయవాడ ఏ- కన్వెన్షన్ సెంటర్లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

-మిగతా 6 లో





## పొట్టి శ్రీరాములు త్యాగం
# నేటి తరానికి స్ఫూర్తి

- పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తి యావత్ తెలుగు జాతికి ఆదర్శం
- నివాళి అర్పించిన హోంమంత్రి అనిత

అనకాపల్లి,
మహానుభావుడు, త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తి యావత్ తెలుగు జాతికి ఆదర్శమని తెలిపారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు అనంతరం అనిత మాట్లాడుతూ.. 58 రోజుల కఠోర ఉపవాస దీక్ష అనంతరం పొట్టి శ్రీరాములు తుది శ్వాస విడిచారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలిన మహానీయుడు పొట్టి శ్రీరాములు

-మిగతా 3 లో

## కేంద్రం తీరువల్లే 'గ్యాస్ కష్టాలు

3 లో



# లడాఖ్ మట్టి సూక్ష్మజీవులతో క్యాన్సర్ చికిత్స



**లడాఖ్: మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్(సీఎస్ఐఆర్) పరిశోధకులు కొత్త విషయాన్ని కనుగొన్నారు. లడాఖ్ మట్టిలో ఉండే సూక్ష్మజీవుల ద్వారా క్యాన్సర్, టీబీ, డయాబెటిస్‌కు చికిత్సను అందివ్వొచ్చు అని తేల్చారు. అక్కడి సూక్ష్మజీవుల్లో ఉండే రసాయనక పదార్థంతో అనేక మొండి వ్యాధులకు ట్రీట్మెంట్ చేయవచ్చు అని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. స్ట్రెప్టోమైసెస్ నెట్రోప్సిస్ అనే బ్యాక్టీరియాను పరిశోధకులు విశ్లేషించారు. ఆ సూక్ష్మజీవిలో సుమారు 13 రకాల రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ ఆల్కలాయిడ్స్‌లో పింప్రినిత్రైన్ అనే పదార్థం ఉన్నట్లు కనుగొన్నారు.సమగ్రమైన స్పెక్ట్రోస్కోపిక్ టెక్నిక్‌లతో ఆ రసాయనాన్ని అధ్యయనం చేశారు. పింప్రినిత్రైన్‌తో చాలా రకాల ఉపయోగాలు ఉన్నట్లు నిర్ధారించారు. యాంటీ మైక్రోబియల్, సైటోటాక్సిక్ యాక్టివిటీ ఆ పదార్థంలో ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ప్రోస్టేట్ క్యాన్సర్ కణాల చికిత్సలో ఈ పదార్థం కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సీఎస్ఐఆర్ పరిశోధకులు చెప్పారు. అంటువ్యాధులు, నాన్ కమ్యూనికెబుల్ వ్యాధుల చికిత్సలో పింప్రినిత్రైన్ సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తేల్చారు. సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసర్చ్ సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.బయోరిసోర్స్ టెక్నాలజీ జర్నల్‌లో దీనిపై సమీక్షను ప్రచురించారు. సూక్ష్మజీవుల్లో ఉండే కొన్ని రకాల సహజసిద్ధమైన రసాయనాల్లో యాంటీబయాటిక్, యాంటీ క్యాన్సర్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నట్లు స్టడీలో పేర్కొన్నారు. హృద్రోగ సంబంధిత వ్యాధుల చికిత్సలోనూ ఆ రసాయనాలు కీలకం అవుతాయన్నారు. లేహ్-లడాఖ్‌లోని హిమాలయ ప్రాంతం సూక్ష్మజీవులకు అనుకూలమైందని పరిశోధకులు చెప్పారు.

# ఏఐ-జనరేటెడ్' లైంగిక వేధింపుల కంటెంట్ నిషేధానికి యూరప్ తొలి అడుగు



**బ్రస్సెల్స్:మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
కృత్రిమ మేధస్సు ద్వారా రూపొందించే పిల్లల లైంగిక వేధింపుల చిత్రాలను నిషేధించేందుకు యూరప్ కీలక చర్యలు ప్రారంభించింది. రెండు సంవత్సరాల క్రితం అమలులోకి వచ్చిన యూరోపియన్ యూనియన్ ఎఐ చట్టంలో ఈ నిబంధనను చేర్చాలని యూరోపియన్ యూనియన్ ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదన ప్రకారం, పిల్లల లైంగిక వేధింపులకు సంబంధించిన చిత్రాలు లేదా వీడియోలను రూపొందించే ఎఐ వ్యవస్థలను నిషేధించాలనే ఉద్దేశంతో చర్యలు తీసుకోనున్నారు. ఇటీవల టెక్ రంగంలో పెరుగుతున్న ఎఐ డీప్‌ఫేక్‌ల సమస్య ఈ నిర్ణయానికి ప్రధాన కారణమైంది. ప్రత్యేకంగా ఎలెన్ మస్క్ కు చెందిన ఎక్స్ ఎఐ రూపొందించిన గ్రోక్ ఎఐ చాట్ బాట్ ద్వారా తయారు అవుతున్న లైంగిక కంటెంట్, డీప్‌ఫేక్‌లపై యూరప్ నుండి ఆసియా వరకు ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇదే నేపథ్యంలో యుకె, ఇర్లాండ్, స్పెయిన్ దేశాల టెక్ నియంత్రణ సంస్థలు గ్రోక్ ద్వారా రూపొందిన అటువంటి కంటెంట్ ను పరిశీలిస్తున్నాయి. ఈ ప్రతిపాదన అమలులోకి రావాలంటే ముందుగా యూరోపియన్ పార్లమెంట్ మద్దతు అవసరం. చట్టసభ సభ్యులు బుధవారం దీనిపై ఓటింగ్ నిర్వహించనున్నారు. అయితే ఏఐ చట్టంలోని కొన్ని భాగాలను సడలించాలనే యూరోపియన్ కమీషన్ ప్రతిపాదనపై కూడా చర్చలు జరుగుతున్నాయి. టెక్ కంపెనీలు ఈ చర్యను స్వాగతిస్తుండగా, పౌర హక్కుల సంఘాలు మరియు గోప్యతా కార్యకర్తలు బిగ్ టెక్ లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. ఏవైనా మార్పులు పూర్తిగా అమలులోకి రావడానికి సుమారు ఒక సంవత్సరం సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ గ్యాస్..

# పెట్రోల్, డీజిల్‌కూ కొరత లేదు



**న్యూఢిల్లీ మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
దేశంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందని, త్వరలోనే గ్యాస్ సిలిండర్ ధర రూ.2,000 దాటుతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఈ ప్రచారానికి తెరదించేందుకు కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌లు అందుబాటులో ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది.అదేవిధంగా పెట్రోల్, డీజిల్ కూడా తగినంతగా అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టంచేసింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హోర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని వెల్లడించింది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఆగిపోయిన అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని పేర్కొంది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని తెలియజేసింది.

## యుద్ధంలో తొలిసారి

# 'డ్యాన్సింగ్ మిస్సైల్'ను వాడిన ఇరాన్.

### దాని ప్రత్యేకత ఏంటంటే..!



**న్యూఢిల్లీ మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు కొనసాగిస్తోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల లోని అమెరికా స్థావరాలు, ఆస్తులే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. బహ్రెయిన్ , సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాలపైకి భారీగా క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగిస్తున్నది.తాజాగా ఇజ్రాయెల్, యూఎస్ స్థావరాలే లక్ష్యంగా చేసిన దాడుల్లో ఇరాన్ అధునాతన క్షిపణులను ప్రయోగించింది. యుద్ధంలో తొలిసారిగా డ్యాన్సింగ్ మిస్సైల్‌గా పిలువబడే 'సెజ్జిల్-2' ని వినియోగించింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇరాన్ స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ క్షిపణిని అషౌరా అనే పేరుతో కూడా పిలుస్తారు. సుదూరప్రాంతాల్లోని లక్ష్యాలను ఇది సమర్థంగా ధ్వంసం చేయగలదు.

**డ్యాన్సింగ్ మిస్సైల్ ప్రత్యేకత..!**
ఇరాన్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ డ్యాన్సింగ్ మిసైల్ పరిధి 2,000 కిలోమీటర్లకు పైనే ఉంటుంది. ఏకంగా 700 కిలోల వార్ హెడ్‌లను మోసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం. అత్యధిక ఎత్తులో కూడా సమర్థంగా తిరుగుతూ లక్ష్యాన్ని ఢీకొడుతుంది. అందుకే దీన్ని డ్యాన్సింగ్ మిసైల్ అని పిలుస్తారు. ఐరన్ డోమ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలను తప్పించుకునేలా ఈ క్షిపణిని రూపొందించారు. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ ప్రకారం.. ఈ క్షిపణి దాదాపు 18 మీటర్ల పొడవు, 1.25 మీటర్ల వ్యాసం కలిగి ఉంటుంది. దీని బరువు 23,600 కిలోగ్రాములు. ఈ క్షిపణుల రూపకల్పనను ఇరాన్ 1990లో ప్రారంభించింది. మొదటిసారిగా దీన్ని 2008లో పరీక్షించారు. ఆ సమయంలో ఈ క్షిపణి దాదాపు 800 కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలుస్తోంది. దాంతో మెరుగైన నావిగేషన్ వ్యవస్థలను రూపొందించి 2009లో రెండోసారి ఈ మిస్సైల్‌ను పరీక్షించారు. అప్పటి నుంచి ఆ తర్వాత కూడా పలుమార్లు పరీక్షలు జరిపారు. ఆరోసారి ప్రయోగం చేసే సమయంలో ఈ క్షిపణి హిందూ మహాసముద్రంలోకి దాదాపు 1,900 కిలోమీటర్లు ప్రయాణించినట్లు సమాచారం.


# గ్యాస్ కొరతపై మమతా బెనర్జీ నిరసన..

### కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్



**కోల్‌కతా మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
దేశంలో నెలకొన్న ఎల్పీజీ గ్యాస్ కొరతపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రజలకు తగినంత గ్యాస్ సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత గ్యాస్ సంక్షోభానికి ప్రధాని మోదీ బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం కోల్‌కతాలో గ్యాస్ కొరతపై జరిగిన నిరసనకు మమతా బెనర్జీ నేతృత్వం వహించారు. 'బెంగాల్ ప్రజల హక్కులు, గౌరవం' కోసం ఐక్య సమీకరణగా ఈ నిరసన ర్యాలీ జరిగిందని తెలిపారు.కాగా, ఎల్పీజీ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం కారణమని మమతా బెనర్జీ విమర్శించారు. పశ్చిమ ఆసియాలో సంఘర్షణ కారణంగా ఇంధన అంతరాయాల మధ్య ఆంక్షలు విధించే ముందు వంట గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వల అంశంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. గ్యాస్ కొరత సంక్షోభానికి ప్రధాని మోదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## 8 ఏళ్ల బాలికపై.. ముగ్గురు బాలురు సామూహిక అత్యాచారం



**న్యూఢిల్లీ: మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
ముగ్గురు బాలురు కలిసి 8 ఏళ్ల బాలికను గోడౌన్‌లోకి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. వరుసగా రెండు రోజులు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు నిందితులైన ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఓఖ్లా ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల బాలుడు, 13 ఏళ్ల వయస్సున్న ఇద్దరు బాలురు కలిసి 8 ఏళ్ల బాలికను ఆశ పెట్టారు. మార్చి 12, 13న బాలిక ఇంటి సమీపంలో ఉన్న గోదాములోకి ఆమెను తీసుకెళ్లారు. ఆ రెండు రోజులు పగటి వేళ ఆ గోదాంలో బాలిక లోదుస్తులు విప్పి ముగ్గురు బాలురు ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు కాగా, మార్చి 14న పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో మహిళా పోలీస్ అధికారిణితో కూడిన పోలీస్ బృందం ఆ ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు చేసింది. బాధిత బాలికను వైద్య పరీక్షల కోసం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన ముగ్గురు బాలనేరస్థులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారిని జువినెల్ హోమ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

# ప్రతి నియోజకవర్గంలోనూ డిఎంకె విజయం సాధించాలి



**చెన్నై మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి నియోజకవర్గంలోనూ డిఎంకె విజయం సాధించాలని, ఆవిధంగా కష్టపడాలని డిఎంకె అధ్యక్షులు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం చెన్నైలో పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శులతో జరిగిన సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ.. 'నిన్ననే ఎన్నికల తేదీని ప్రకటించారు. ఏప్రిల్ 23కి కేవలం 39 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. మన పార్టీ ఎన్నికల పనికి సిద్ధమైంది. సంక్రాంతికి అన్ని కుటుంబాలకు రూ. 3 అందించడం, 1.31 కోట్ల కుటుంబాలకు మహిళా హక్కుల సహాయంగా రూ. 5 వేలు మంజూరు చేయడం, సీనియర్ సిటిజన్లు, వికలాంగులు సహా దాదాపు 40 లక్షల మందికి రూ. 2,000 ప్రత్యేక ఆర్థిక సహాయం అందించడం వంటి మన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలలో మనకు మద్దతు గణనీయంగా ఉంది. ఎన్నికల్లో మనం పోటీ చేసే ప్రతి నియోజకవర్గంలోనూ విజయం సాధించాలి. కూటమి భాగస్వాములతో కలిసి 200 నియోజకవర్గాలను గెలవడమే మన లక్ష్యం. కష్టపడి పని చేయండి. మనమంతా కలిసి పనిచేద్దాం. మనం గెలుస్తాం' అని స్టాలిన్ మార్గనిర్దేశం చేశారు.

# ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

మొదటి తరువాయి

జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

# గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

మొదటి తరువాయి

నౌకలు చైనా యుద్ధ విమానాలు తైవాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. కాగా, ఫిబ్రవరి 27 నుండి మార్చి 13 వరకు తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ విమానాల రాక గణనీయంగా తగ్గింది. సాధారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో విమానాలను పంపే చైనా, ఈ 16 రోజుల కాలంలో కేవలం 7 విమానాలను మాత్రమే పంపింది. అయితే, ఈ ఆకస్మిక విరామానికి కారణమేంటో రక్షణ నిపుణులకు సైతం అంతుచిక్కలేదు. కానీ, ఆదివారంనుండి చైనా మళ్ళీ తన దూకుడును పెంచింది. తైవాన్ చుట్టూ సుమారు 26 చైనా సైనిక విమానాలను గుర్తించారు. వీటిలో 16 విమానాలు తైవాన్ నైరుతి ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ లోకి ప్రవేశించాయి. విమానాలతో పాటు 7 చైనా యుద్ధ నౌకలు కూడా తైవాన్ సముద్ర తీరానికి సమీపంలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 25న 30 విమానాలు వచ్చిన తర్వాత, మళ్ళీ ఈ స్థాయిలో విమానాలు రావడం ఇదే తొలిసారి. ఇలాఉండగా, మార్చి 31న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఇక, చైనా విమానాలు లేని సమయంలో కూడా వారి యుద్ధ నౌకలు సముద్రంలోనే ఉన్నాయని తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ స్పష్టం చేశారు. చైనా నుండి ముప్పు ఏమాత్రం తగ్గలేదని.. తాము నిరంతరం అప్రమత్తంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

# అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉంది

మొదటి తరువాయి

కేవలం ఒక కర్రీతో సరిపెడుతున్నాయి. గ్యాస్ కొరత కారణంగా పలు దేవాలయాలు తాత్కాలికంగా ప్రసాదం తయారీని నిలిపివేశాయి. సీఎన్‌జీ బంకుల్లోనూ గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. దీని కారణంగా గ్యాస్‌తో నడిచే వందలాది ఆటోలు నిలిచిపోతున్నాయి. డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కూడా కష్టాలు తప్పటం లేదు. బుకింగ్, డెలివరీ విషయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. యుద్ధ పరిస్థితులకు తోడు.. పండుగ సమయం కావటంతో గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి సిలిండర్ తీసుకుంటున్నారు

# కేంద్రం తీరువల్లే 'గ్యాస్ కష్టాలు

ప్రతిపక్షాల ఆందోళన

ప్రభుత్వానిదే బాధ్యత : మల్లికార్జున్ ఖర్గే

ప్రజల వద్దకు వెళ్తే సంక్షోభం లోతు అర్థమవుతుంది :జాన్ బ్రిట్టాస్



**న్యూఢిల్లీ**

దేశంలో నెలకొన్న వంట గ్యాస్ సంక్షోభంపై ప్రతిపక్షాలు పార్లమెంటులో ఆందోళన చేపట్టాయి. సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. సోమవారం వంట గ్యాస్ సంక్షోభంపై రాజ్యసభ దద్దరిల్లింది. జీరో అవర్‌లో రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. వంట గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం చెబుతున్న మాటలు తప్పని వాస్తవ పరిస్థితులు నిరూపిస్తున్నాయని చెప్పారు. గల్ఫ్ యుద్ధం, హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గ్యాస్ సమస్య మధ్య తరగతి, రెస్టారెంట్లు, హాస్టళ్లు, వాణిజ్య వినియోగదారులను ప్రభావితం చేస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌పిజి లభ్యత, ధర స్థిరత్వం తీవ్రమైన సమస్యలుగా మారాయనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంతో తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించలేదని, దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ల తీవ్ర కొరతకు ప్రభుత్వమే కారణమని విమర్శించారు. రెస్టారెంట్లు, హాస్టళ్లు, కమ్యూనిటీ కిచెన్‌లను మూసివేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైపు వంట గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఎల్‌పిజి సరఫరాపై కేంద్రం ముందస్తు ప్రణాళిక వేసుకుని ఉంటే, ఈ పరిస్థితి తలెత్తేది కాదని పేర్కొన్నారు. ఖర్గే ఎరువుల సరఫరా కొరతను కూడా ఎత్తిచూపారు. సిలిండర్ కోసం వెయిటింగ్ సమయాన్ని కూడా 21 నుంచి 25 రోజులకు పెంచారని, ఇది బ్లాక్ మార్కెటింగ్‌కు దారి తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రి హరిదీప్ సింగ్ పూరి దేశంలో ఎల్‌పిజి సరఫరాపై తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు.

# పొట్టి శ్రీరాములు త్యాగం నేటి తరానికి స్ఫూర్తి

మొదటి తరువాయి

అని హోంమంత్రి కొనియాడారు. పొట్టి శ్రీరాములు త్యాగానికి ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిలో అమరజీవి 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని హోంమంత్రి అనిత పిలుపునిచ్చారు.

# పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఓ చరిత్ర

మొదటి తరువాయి






ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు సమీపంలో 6.8 ఎకరాల్లో నిర్మిస్తున్న స్మృతివనంలో అమరజీవి 125వ జయంతి వేడుకలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఆర్యవైశ్య సంఘాలు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి.. ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారు పేరు ఆర్యవైశ్య సంఘమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పనిచేశారని తెలిపారు. అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్టాన్ని సాధించి పెట్టారని చెప్పారు. ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు. రాజధాని లేని




రాష్ట్రంలో వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పారు.

గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడు ఏళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. అమరావతి వల్ల సంక్షేమం సక్రమంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మొన్నటి వరకూ ఆర్య వైశ్యులు వ్యాపారాలు చేసుకోవాలన్నా భయపడుతూ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రూ. 10 సంపాదిస్తే అందులో రూ.2 దానం చేసేది ఆర్య వైశ్య కులమని తెలిపారు. ఆర్య వైశ్యులను అనేక విధాలుగా పిలుస్తారని.. అందరిని అదే పేరుతో పిలచేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. పొట్టి శ్రీరాములకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఏపీలో పదోతరగతి పరీక్షలు ప్రారంభం

మొదటి తరువాయి

ఆటోల్లో, బైక్ లు మీద తల్లి తండ్రులు, ప్రైవేటు స్కూళ్లు యాజమాన్యాలు విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు హాల్ టికెట్స్ నెంబర్ ఆధారంగా రూం కేటాయింపు చూసుకున్నారు. అనంతరం ఆరగంట ముందు విద్యార్థులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. విద్యార్థులు దగ్గర ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయా అనేది చెక్ చేసి పరిశీలించి లోపలికి పంపించారు. బాలురకు పురుషులు, బాలికలకు స్త్రీ సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఏప్రిల్ 1వ తేదీతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రత్యేక



పరిస్థితుల్లో 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల హాల్ టికెట్ చూపించి, ఆర్టీసీ బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు ఉచితంగా చేరుకోవచ్చు. ఈ ఏడాది మొత్తం 6,40,916 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. విద్యార్దులు వెంట వచ్చిన తల్లి తండ్రులు,ఉపాధ్యాయులు స్నేహితులు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ వారికి దైర్యం చెబుతూ శుభాకాంక్షలు తెలియజేసారు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఏ మాత్రం ఒత్తిడికి గురికావద్దు. ప్రశాంతంగా ఉండండి అంటూ విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. ఈ పరీక్షల్లో 100 శాతం మీ ప్రతిభను ప్రదర్శించే సమయం ఇదని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు రాయండంటూ వారికి ఆయన స్పష్టం చేశారు. విజయం మీదే. ఆల్ ది బెస్ట్ అంటూ వారికి మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా 10వ తరగతి విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు. --------

# చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందిస్తాం

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్.**

**మెదక్ జిల్లా**

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వివాదాలు, పోలీస్ సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ కి నేరుగా విన్నవించుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను



క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకునేలా సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని అంశాలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని ప్రజలను కోరారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగిందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# ట్రంప్‌కు షాక్

వ్యాఖ్యానిం చారు. ఎర్ర సముద్రంలో పలు నావికా మిషన్‌లలో ఇటలీ పాల్గొంటోందని, వాటిని హార్మూజ్‌కు విస్తరించే అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, హార్మూజ్ ద్వారా రవాణా అయ్యే చమురుపై ఆధారపడిన ఏడు దేశాలను కలిసి రావాల్సిందిగా కోరినట్లు చెప్పారు. ఆ ఏడు దేశాల పేర్లేమిటో ఆయన వెల్లడించలేదు. అందులో చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ సహా పలు దేశాలు వున్నట్లు తెలుస్తోంది. నాటో సభ్య దేశాలు కూడా యుద్ధ నౌకలను పంపి, హార్మూజ్‌ను తెరిచి వుంచేందుకు సాయపడాలని ఆయన కోరారు. లేనిపక్షంలో నాటో భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. "స్పందించకపోయినా లేక ప్రతికూలంగా స్పందించినా అది నాటో భవితవ్యానికి చాలా చెడ్డది." అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి స్పందిస్తూ, హార్మూజ్‌ను మూసివేయలేదని, తెరిచే వుంచామని చెప్పారు. తమ శత్రువులకు మాత్రమే దాన్ని మూసివేశామని చెప్పారు. ఎవరైతే దురాక్రమణ చర్యలకు దిగారో వారికి, వారి మిత్రులకు ఈ జలసంధి మీదుగా ఎలాంటి అనుమతి లేదని తేల్చి చెప్పారు. ఏ ఒక్క అమెరికా నౌక కూడా గల్ఫ్‌లోకి ప్రవేశించే హక్కు లేదని ఆయన వ్యాఖ్యానించారు.

# సంపాదకీయం

## మరికొన్నాళ్లు వంటగ్యాస్ సంక్షోభం




దేశంలో గ్యాస్ కోసం ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. కమర్షిల్ గ్యాస్ అస్సలు లభించడం లేదు. దీంతో హోట్ పరిశ్రమ కుదేలయ్యింది. దేశవ్యాప్తంగా హోటళ్లు మూతపడ్డాయి. కార్మికులు రోడ్డున పడ్డారు. తిరిగి క ట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నారు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీలో కట్లె పొయ్యిలను అనుమతించని ప్రభుత్వం తిరిగి అక్కడ కట్టెల పొయ్యిలకు అనుమతించింది. దీంతో గ్యాస్ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవచ్చు. దీనికి ఎవరిని నిందించి కూడా ప్రయోజనం లేదు. ఉన్న గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. పానిక్ బుకింగ్స్ వల్ల చాలామందికి ఇబ్బంది ఎదురవుతోంది. అలాగే సిలిండర్లను బ్లాక్‌లో అమ్ముకుం టున్నారు. దీనికి ముందుగా చెక్ పెట్టాలి. గ్యాస్ సరఫరాలపై విజిలెన్స్ నిఘా పెట్టాలి. నల్లబజారుకు తరలకుండా చూడాలి. అలాగే హోటల్ పరిశ్రమను ఆదుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో రెండు ఇంధన నౌకలు హర్మూజ్ జలసంధి దాటి భారత్ చేరుకున్నాయి. ఇది కొంత ఊరటనిచ్చే అంశం. పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వెళ్లే ఏకైక సముద్ర మార్గమైన హోర్మూజ్ జలసంధిని మూసివేస్తు న్నట్లు ఇరాన్ ప్రకటించింది. జలసంధి నిండా వందలాది ట్యాంకర్లు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధర యుద్ధానికి ముందు బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉండగా, ఇప్పుడది వంద డాలర్లకు పెరిగింది. ఇదే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ధర మరింతగా పెరగడం ఖాయమన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఇరాన్‌కు సమీపంలోని 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు ఐదవ వంతు సాగుతుంది. మన దేశం రోజుకు సగటున 40 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటూ ఉండగా, అందులో 55 శాతం దీని ద్వారానే వస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడితో మన దేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమ ఆసియా అంతా యుద్ధ మేఘాలు విస్తరిస్తున్నాయి. అమెరికా ఇరాన్‌పై చేసిన దాడి 16వ రోజుకు చేరుకుంది. ప్రతి బ్యారెల్ చమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల చోటుచేసుకున్నా, భారత్‌పై సంవత్సరానికి 200 కోట్ల రూపాయల అదనపు దిగుమతి భారం పడుతుందని అంచనా! అధికారిక సమాచారం ప్రకారం 2024-25లో చమురు దిగుమతుల కోసం మన దేశం సుమారుగా 11.5 లక్షల కోట్ల రూపాయల (137 బిలియన్ డాలర్లు)ను ఖర్చు చేసింది. ఏకపక్షంగా యుద్ధానికి కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ప్రస్తుతం నాలుగు నుండి ఐదు వారాలు' కొనసాగవచ్చని చెబుతున్నారు. ఇరాన్ ప్రతిఘటన తీరును గమనిస్తున్న పరిశీలకులు యుద్ధం అంతకన్నా ఎక్కువ రోజులే సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా పెరిగే దిగుమతి ఖర్చుల వల్ల విదేశీ లోటు పెరిగి వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని, రూపాయిపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశీయ ట్రేడ్ సూచికలు పతనోన్ముఖానే వున్నాయి. మరోవైపు మన దేశం వద్ద ఉన్న చమురు నిల్వలు మరో 40-45 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా వద్ద దాదాపు ఆరునెలలకు సరిపడే నిల్వలు ఉండటం అక్కడి పాలకుల ముందు చూపునకు నిదర్శనం. రష్యా నుండి దిగుమతులుతగ్గాయి. ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా చేసిన దాడి, హార్మూజ్ జలసంధి మూసివేతతో మన దేశ ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారినప్పటికీ ఇరాన్ భారత్ పట్ల అనుకూలత ప్రదర్శించింది. 40 రోజులకు సరిపడే నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ యుద్ధ తీవ్రత కొనసాగితే పెట్రో ధరలు పెరగక తప్పవన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులతో పాటు, అన్ని రకాల వినియోగ సరుకుల మీద ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే జరిగితే, దేశ వ్యాప్తంగా సామాన్యుల కష్టాలు మరింత పెరగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చమురు సరఫరా వనరులను విస్తరించేందుకు కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా హోటల్ పరిశ్రమలను ఆదుకోవాల్సి ఉంది. అయితే పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్‌కు డిమాండ్ అమాంతం పెరిగిందని కేంద్రప్రభుత్వం అంగీకరించింది. అయినప్పటికీ వంట గ్యాస్ పంపిణీలో ఇబ్బంది లేదని భరోసా ఇచ్చింది. దేశీయంగా వంట గ్యాస్ ఉత్పత్తి 30శాతం మేర పెంచినట్లు తెలిపింది. వాణిజ్య సిలిండర్ల కొరత ఉండడంతో హోటళ్లు, ఆహార పరిశ్రమ ఇబ్బందులు పడుతోందని అంగీకరించారు. అందువల్ల వాణిజ్య సిలిండర్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించామని చెప్పారు. ప్రాధాన్య క్రమంలో అవి పంపిణీ చేస్తాయని తెలిపారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలకు వంట గ్యాస్‌ను అందజేస్తామని ప్రకటించారు. ఇక, ఇళ్లకు పైపుల ద్వారా సరఫరా అయ్యే పైప్డ్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), వాహనాలకు వినియోగించే కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)ల సరఫరాకు ఎలాంటి అంతరాయాలు లేవని తెలిపింది. పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వారికి గ్యాస్ సిలిండర్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా ఈ సంక్షోభం ఇంకెంతకాలం అన్నది యుద్ధ తీవ్రతను బట్టి మాత్రమే మారుతుందన్నది నిజం.

# మొజ్తాబా ఖమేనీకి మాస్కోలో చికిత్స..

### ఖర్గ్ దీవికి అమెరికా సైనిక బలగాలు !

**మాస్కో మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
ఇరాన్ సుప్రీం నేతగా మొజ్తాబా ఖమేనీ ఎన్నికైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందిన నేపథ్యంలో కొత్త నేతను ఎన్నుకున్నారు. అలీ ఖమేనీ కుమారుడైన మొజ్తాబా ఆ రోజు జరిగిన దాడిలో గాయపడినట్లు తెలిసిందే. అయితే మొజ్తాబాకు ప్రస్తుతం రష్యా రాజధాని మాస్కోలో వైద్య చికిత్స జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కువైట్ మీడియాలో దీనికి సంబంధించిన వార్తలు వెలుబడ్డాయి. ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ చికిత్స కోసం మాస్కో చేరుకున్నట్లు కువైట్ మీడియా వెల్లడించింది. అయితే క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ వార్తలపై ఎటువంటి కన్ఫర్మేషన్ కానీ ఖండన కానీ చేయలేదు. ఇలాంటి



వార్తలపై తాము ఎప్పుడూ కామెంట్ చేయబోమని ఆయన అన్నారు. తమ వైమానిక దాడిలో మొజ్తాబాకు గాయాలయ్యాయని కొన్ని రోజుల క్రితం అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ పేర్కొన్న విషయం తెలిసిందే.మరో వైపు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ .. తమ సైనిక బలగాలను ఖర్గ్ దీవికి పంపే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఖర్గ్ దీవిలో ఉన్న ఇరానీ మిలిటరీ కేంద్రాలను అమెరికా వైమానిక దళాలు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఇరాన్ చమురు సరఫరాకు కీలకమైన టర్మినల్‌గా ఖర్గ్ దీవి వ్యవహరిస్తోంది. అయితే ఆ దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీయాలన్న ఉద్దేశంతో ఆ దీవిపై దాడి చేశారు. ఆ దీవి నుంచి ఇరాన్ సుమాఉ 90 శాతం ఇంధనాన్ని ఎగుమతి చేస్తుంది. ఒకవేళ ఖర్గ్ దీవికి అమెరికా తన బలగాలను పంపిస్తే, అప్పుడు గల్ఫ్ పరిస్థితులు మరింత భీకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఆ ఎత్తుగడలను ఎదుర్కొనేందుకు ఇరాన్ మరింత విస్తృతంగా అమెరికాకు సంబంధం ఉన్న ఆయిల్ కంపెనీలపై దాడి చేసే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్‌పై క్రిమినల్ చర్యలు రద్దు

**న్యూఢిల్లీ మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్‌పై క్రిమినల్ చర్యలను సుప్రీంకోర్టు సోమవారం రద్దు చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై సోషల్‌మీడియా పోస్ట్‌లకు సంబంధించి ప్రొఫెసర్‌పై విచారణకు అనుమతి నిరాకరించినట్లు హర్యానా ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఒక్కసారి ఉదారతతో హర్యానా ప్రభుత్వాన్ని అనుమతి నిరాకరించాలని గతంలో ఆదేశించిన సంగతి తెలిసిందే. ధర్మాసనం సూచనను ఆమోదించామని హర్యానా ప్రభుత్వం తరపున



హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు కోర్టుకు తెలిపారు. ప్రొఫెసర్‌అలీఖాన్ భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించాలని కోరారు. "కొన్ని సార్లు పరిస్థితి సున్నితంగా ఉంటుందని, మనం జాగ్రత్తగా వ్యవహరించాలి" అని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ అలీఖాన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, నిజామ్ పాషాలకు సిజెఐ సూచించారు.
ఆపరేషన్ సిందూర్‌పై అలీఖాన్ పోస్ట్‌లు దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను ప్రమాదంలో పడేశాయంటూ గతేడాది మే18న హర్యానా పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. మహిళా కమిషన్ రాష్ట్ర విభాగం చైర్‌పర్సన్ రేణుభాటియా, సొనిపేట్ జిల్లాలోని గ్రామ సర్పంచ్ ఫిర్యాదుల మేరకు అలీఖాన్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

---


# ఇరాన్‌పై వ్యూహాత్మకంగా దాడి చేశాం

### ఇజ్రాయిల్ రాయబారి రూవెన్



**న్యూఢిల్లీ మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
ఇరాన్‌పై వ్యూహాత్మకంగా దాడి చేశామని, తమ లక్ష్యాలు దృఢంగా ఉన్నాయని ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ ధృవీకరించారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 'వారి సైనిక స్థావరాలపై దాడికి సంబంధించి ఎలాంటి మార్పు లేదు' అని ఆయన అన్నారు. మేము మూడు లక్ష్యాలతో దాడులు చేశాం. మొదటిది న్యూక్లియర్, ఆ తర్వాత బాలిస్టిక్ క్షిపణి, ఇరాన్ లోపల అణు శక్తి సామర్థ్యాలను తగ్గించడం వంటి మూడు లక్ష్యాలతో ఇరాన్‌పై దాడి చేశాము. వీటిపై ఎలాంటి మార్పు లేదు అని రూవెన్ అజార్ తెలిపారు. అయితే అమెరికా-ఇజ్రాయిల్ దాడికి ఇరాన్ సైన్యం కచ్చితంగా ఎదురుదాడికి దిగుతుందని తాము ఊహించామని ఆయన అన్నారు. జూన్‌లో దాడి చేసినప్పుడు ఇరాన్ సామర్థ్యాలను తగ్గించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. అయితే ప్రతిదాడిగా ఇప్పుడు ఇరాన్ 12 దేశాలపై దాడి తీవ్రతరం చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని రూవెన్ అజార్ చెప్పారు.

# 250 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసిన రష్యా వైమానిక దళాలు



**మాస్కో మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
రాజధాని మాస్కోను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన 250 ఉక్రెయిన్ డ్రోన్‌లను వైమానిక రక్షణ దళాలు అడ్డుకున్నాయని రష్యా సోమవారం తెలిపింది. వారాంతంలో మాస్కోపై ప్రయోగించిన 250 డ్రోన్‌లను వైమానిక దళాలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ పేర్కొన్నారు. సోమవారం కొన్ని ప్రధాన విమానాశ్రయాలు కార్యకలాపాలను రద్దు చేయడంతో మేయర్ ఈ ప్రకటన విడుదల చేశారు. మాస్కోను సమీపిస్తున్న మొత్తం 159 డ్రోన్‌లను భద్రతాదళాలు కూల్చివేశాయని అన్నారు. 'రక్షణశాఖలోని వైమానిక విభాగం వృత్తిపరమైన విధికి మరియు అంకితభావానికి ధన్యవాదాలు' అని మేయర్ ఒకపోస్ట్‌లో తెలిపారు.
వైమానిక భద్రత దృష్ట్యా రాజధానిలోని డొమోడెడెవో మరియు జుకోవ్స్కీ విమానాశ్రయాలు కార్యకలాపాలను పరిమితం చేశాయని స్థానికమీడియా తెలిపింది. ప్రయాణికులు విమానాల షెడ్యూల్స్‌ను తనిఖీ చేసుకోవాలని సూచించింది. మరో విమానాశ్రయం వ్నుకోవో కూడా కార్యకలాపాలను రద్దు చేసింది.

# పశ్చిమ బెంగాల్‌లో ఇడి దాడులు

### అక్రమ కాల్ సెంటర్ కేసు


**కోల్‌కతా మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
సోమవారం అక్రమ కాల్ సెంటర్ కార్యకలాపాలపై దర్యాప్తులో భాగంగా పశ్చిమ బెంగాల్లో సోమవారం ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారులు సోమవారం పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.. సిలిగురి, హౌరా, బిధాన్ నగర్, దుర్గాపూర్‌లలో ఉన్న దాదాపు పది కాల్ సెంటర్లపై




సోదాలు నిర్వహించినట్లు ఇడి అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున ఈ ఇడి దాడులు జరగడం గమనార్హం. ఎన్నికల వేళ పలు రాజీయ పార్టీలకు నిధులకు సంబంధించా? లేక ఎన్నికల ప్రక్రియలో చొరవగా పాల్గొనడం దాని గురించి ఇడి దాడులకు పాల్పడిందా అనే దానిపై స్పష్టత లేదు.

# గోలు అండ్ పప్పా - ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవరీ హోమ్" పుస్తకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

### పుస్తక రచయిత డాక్టర్ జావేద్ కు అభినందన



**అమరావతి, మార్చి 16 డ్రీమ్ టైమ్స్:** విజయవాడలోని ఏ- కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన రాష్ట్రస్థాయి దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమంలో "గోలు అండ్ పప్పా - ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవరీ హోమ్" అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ప్రథమ చికిత్స ( ఫస్ట్ ఎయిడ్ )గురించి అందరికీ అర్థమయ్యేలా కథల రూపంలో చక్కగా వివరించినందుకు పుస్తక రచయిత డాక్టర్. జావేద్ అష్రఫ్ ను చంద్రబాబు అభినందించారు. న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఇంటా బయట ప్రమాదాలు లేదా ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిపుణుడైన డాక్టర్ దగ్గరకు లేదా ఆసుపత్రికి తీసుకెళ్లేదాక పేషంటును రక్షించడానికి అవసరమైన ప్రథమ చికిత్సను కథల రూపంలో పిల్లలకు వివరించడం చాలా బాగుందన్నారు. ఈ పుస్తకం ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరి దగ్గర ఉండవలసిన పుస్తకమని అన్నారు. ఈ పుస్తకం చదివిన వారిలో ఆత్మ విశ్వాసం పెరిగి ఇంటి వారిని బయటివారిని రక్షించడానికి ముందుకువస్తారన్నారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ జావేద్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో కుటుంబాలు చిన్నవైపోయాయని, ఏదైనా జరిగితే ఆదుకునే వాళ్లు కరువైనారని, అలాగే సరైన అవగాహనలేనందువల్ల దారిలో ఎవరైనా పడిపోతే ఏమిచేయాలో తెలియక చాలామంది ప్రేక్షకులుగా ఉండిపోతున్నారని అన్నారు. అందువల్ల ప్రజల్లో ప్రథమ చికిత్స పట్ల అవగాహన పెంపొందించి వారు అవసరమైనపుడు తమ వాళ్లకు, ఇతరులకు సహాయపడేలా చూడాలనే ఉద్దేశ్యంతోనే తాను అందరికీ అర్థమయ్యేలా కథలరూపంలో ప్రథమ చికిత్సపై ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందని పేర్కొన్నారు. తన పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రోత్సహించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఫరూక్ లకు డాక్టర్ జావేద్ కృతజ్ఞతలు తెలిపారు.

# 150 మంది నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

### గత పదేళ్లుగా పంపిణీ చేస్తున్న టూవీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాధిక్



**ఎమ్మిగనూరు,మార్చి 16 డ్రీమ్ టైమ్స్:** టూ వీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ సాధిక్ ఈ ఏడాది కూడా దాతృత్వం చాటుకున్నారు. బైక్ మెకానిక్ పని చేస్తూనే వచ్చిన దాంట్లో కొంత సమాజానికి ప్రతి ఏటా వెచ్చిస్తూనే ఉన్నారు. నిరుపేద కుటుంబాలకు ప్రతి ఏటా తన వంతు సహాయం చేస్తూనే ఉన్నాడు. ప్రతి ఏటా మాదిరే ఈ ఏడాది కూడా 150 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఒక కేజీ సేమియా, ఒక కేజీ చక్కెర, 100 గ్రాముల బాదం పప్పు, ఆయిల్, దుప్పట్లతో పాటు పండుగ కు కావలసిన అన్ని సరుకులను ఒక బాక్స్ లో కలిపి నిరుపేద ముస్లిం కుటుంబాలకు అందజేశారు. గత పదేళ్లుగా ఈ సేవా కార్యక్రమం కొనసాగిస్తున్నారు. కరోనా సమయంలో కూడా పేదలకు బియ్యం, బ్యాళ్లు, నూనె తదితర కిట్ల ను అందజేశారు. అలాగే పాదాచారులకు నీళ్లు, బిస్కెట్లు,, బోజనాలు కూడా అందజేస్తూ వస్తున్నారు. మెకానిక్ వృత్తి చేస్తూనే వచ్చిన ఆదాయంలో కొంత పేద ప్రజల సేవకు వెచ్చిస్తున్నారు. సహాయం చేయడానికి డబ్బులు కాదు మనసు ఉండాలని నిరూపిస్తున్నారు. అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సాదిక్ సేవలను చూస్తున్న పలువురు నేతలు, ప్రజలు, ప్రజా సంఘాల నేతలు కూడా అభినందిస్తున్నారు. తన కష్టార్జితంలో కొంత భాగాన్ని సామాజ సేవకు వెచ్చిస్తున్న సాదిక్ నేటి యువతకు ఆదర్శనీయం అన్నారు. అందరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

# శ్రీశైలక్షేత్రానికి...ఉత్సవ శోభ.

### కన్నడీగులు సంబరాలలో సందడిగా మారినవైనం





**శ్రీశైలం మార్చి 16 డ్రీమ్ టైమ్స్:** శ్రీశైలమహాక్షేత్రం భక్తులతో పోటెత్తింది. లక్షలాది కన్నడీగులు విన్నూత రీతిలో చేస్తున్న సంబరాలతో క్షేత్రపరిధి సందడిగా మారింది. ఉగాది మహోత్సవాలు ప్రారంభం కావడంతో ఆదివారం వేకువజామునుండే ఆలయమాడవిధుల్లోసందడి వాతావరణంనెలకొంది. శ్రీశైల క్షేత్రానికి కర్ణాటక రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రామైన మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో క్షేత్రపురవిధులు నిండిపోయాయి. భక్తులరద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు తెల్లవారుజామున2గంటలకే ఆలయద్వారాలు తెరచి మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, ప్రాతఃకాలవ్రాజ, మహామంగళహారతిసేవల తదుపరి స్వామివార్ల దర్శనాలకు భక్తులకు వీలుకల్పించారు. వేకువజామునే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలుఆచరించి స్వామివార్ల దర్శనాలకు బారులుతీరారు, రద్దీ అధికంగా ఉండడంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు, క్యూకాంప్లెక్, భక్తులతో నిండిపోయాయి. భక్తులతాకిడి దృష్ట్యా స్వామిఅమ్మవార్ల దర్శనాలలో ఎలాంటి ఇబ్బదులు కలుగకుండా ఆలయ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉభయదేవాలయాల నిర్వహణలో ఆయావిభాగాల అధికారులు, సిబ్బంది ప్రత్యేక విధులు నిర్వహించారు. క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్ లలో వేచిఉన్న భక్తులకు అల్పాహారం, తాగునీరు పంపిణీచేశారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి నాలుగు నుండి ఐదు గంటలకు పైగా సమయం పడుతుందని భక్తులు పేర్కొన్నారు. స్వామిఅమ్మవార్ల దర్శనాంతరం భక్తులు స్వామిఅమ్మవార్ల దేవస్థానం అన్నదానభవనంలో మహాప్రసాదాన్నిస్వీకరించి, స్వామివార్ల లడ్డుప్రసాదములవిక్రయకేంద్రాలవద్ద భక్తులు బారులుతీరారు. స్వామివార్లను సుమారు2 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులఅంచన.

# ఉగాది ఉత్సవాలకు బిసి రాజారెడ్డికి ఆహ్వానం



**బనగానపల్లె, మార్చి 16 డ్రీమ్ టైమ్స్:** మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి ఉగాది బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ఆహ్వానించారు. సోమవారం పట్టణంలోని రాజారెడ్డి కార్యాలయంలో ఈనెల 19వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరిగే శ్రీ చౌడేశ్వరి దేవి ఉగాది బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని బీసీ రాజారెడ్డిని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి, ఆలయ చైర్మన్ పి.రామసేతు నాగార్జున రెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిలు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉగాది పండుగ సందర్భంగా ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి రాయబారాది, జ్యోతి, రథ , వసంతోత్సవములు ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. రైతు సంబరాల్లో భాగంగా ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు జాతి వృషభరాజముల అంతర్రాష్ట్ర బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశామని వివరించారు. కీ.శే. పీవీ సుబ్బారెడ్డి, రామ తులసమ్మ దంపతులకు జ్ఞాపకార్థం వారి కుమారుడు పివి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హోమ్ టీమ్స్ కబడ్డీ పోటీలు కూడా ఏర్పాటు చేశామని వారు బిసి రాజారెడ్డికి వివరించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం వస్తారని , అందరికీ త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ పాల్గొన్నారు.

# పెద్దరాజుపాలెంలో చురుకుగా అభివృద్ధి పనులు



**బనగానపల్లె, మార్చి 16 డ్రీమ్ టైమ్స్:** మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామంలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. గ్రామంలో లక్షల రూపాయలతో సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేస్తున్నారు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండు భూషన్న ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను శరవేగంగా చేస్తున్నారు. గ్రామంలోని పీర్ల చావిడి నుంచి వంక వరకు కాలువ నిర్మాణం పూర్తి చేశారు పీర్ల చావిడి నుండి మద్దయ్య ఇంటి వరకు సిమెంటురోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు భూషన్న తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. రూపం 19 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ పనులు చేస్తున్నట్లు తెలిపారు. 19 లక్షల రూపాయలతో 270 మీటర్లు డ్రైనేజీ, 150 మీటర్లు సిమెంట్ రోడ్డు పనులు పూర్తి చేశారు. మరికొన్ని అభివృద్ధి పనులను చేస్తున్నారు.

# పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు మినరల్ వాటర్ ఏర్పాటు




**బనగానపల్లె ,మార్చి 16 డ్రీమ్ టైమ్స్:** పట్టణంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, టిడిపి నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి ల చొరవతో ఉచిత మినరల్ వాటర్ ను ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణంలో పదవ తరగతి పరీక్షల కోసం ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 6 కేంద్రాలలో మినరల్ వాటర్ ఏర్పాటు చేశారు .విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు తాగునీటి కొరత లేకుండా ఉండేందుకు సొంత నిధులతో బీసీ జేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్‌ను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మినరల్ వాటర్ ఏర్పాటు చేశారు. బనగానపల్లె పట్టణంలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, పరీక్షల సమయంలో విద్యార్థులు ఎండ తీవ్రతకు గురికాకుండా అవసరమైన సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ప్రజలు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బీసీ ఇందిరా రెడ్డి సేవాభావాన్ని అభినందిస్తూ, విద్యార్థుల పట్ల చూపుతున్న శ్రద్ధకు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల పాలిట కల్పతరువు ముఖ్యమంత్రి సహాయక నిధి



**బనగానపల్లె, మార్చి 16 డ్రీమ్ టైమ్స్:** పేదల పాలిట కల్పతరువు ముఖ్యమంత్రి సహాయక నిధి అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 27.28 లక్షల చెక్కులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూనిరుపేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయక నిధి కొండంత అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి పాలనలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి ,సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.


# పాస్టర్ బదిలీపై వెళ్లిపోవాలి



**డోన్ మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
చర్చి లోని నిధులను దుర్వినియోగం చేస్తూ ,సంఘస్తులపై కక్షపురితంగా వేధిస్తున్న పాస్టర్ చరణ్ వెంటనే బదిలీపై వెళ్లిపోవాలని మోరియా చర్చి సంఘ పెద్దలు ,సంఘస్థులు డిమాండ్ చేశారు.ఆమేరకు సోమవారం టీచర్స్ కాలనీ లోని మోరియా చర్చి ఎదుట సంఘ పెద్దలు జైపాల్,ఇజ్రాయిల్,అమృత్ తదితరుల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మట్లాడుతూ పాస్టర్ చరణ్ గతంలో కూడా పలుచోట్ల అక్రమాలకు పాల్పడ్డాడని ఇప్పుడు డోన్ లో కూడా అదే తరహా వ్యవహార శైలి తో అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు.బదిలీ ఆదేశాలు వచ్చినప్పటికీ వాటిని బెకాతరు చేస్తున్నాడన్నారు.ఈ కార్యక్రమంలో యోహాన్, గోపాల్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


# సీఎం ఆదేశించినా న్యాయం జరగడం లేదు

రైతులు ఆర్డిఓ ఆఫీస్ ముందు ఆవేదన వ్యక్తం ....




**డోన్ మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
సీఎం ఆదేశించినా తమకు మాత్రం న్యాయం జరగడం లేదని ప్యాపిలి మండలం పొదొడ్డి గ్రామానికి చెందిన రైతు పోతెంరామచంద్రుడు ఆవేదన వ్యక్తంచేశారు.ఆమేరకు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తన పొలం ఆక్రమణ పై ఇటీవల కొత్తబురుజు గ్రామ పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు కు తన కు జరిగిన అన్యాయం పై మొర పెట్టుకున్నా స్థానిక రెవిన్యూ అధికారులు మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తూ నివేదికలు సమర్పించడం అన్యాయం అన్నారు.కనీసం పొలం పక్కన రైతులతో కానీ గ్రామస్థులతో కానీ కనీస విచారన చేపట్టకుండా విచారణ పూర్తి అయిందని అధికారులు చేతులు దులువుకోవడం సమంజసం కాదన్నారు.120 సర్వే నెంబర్ లేకుండా 120-1,120-2 లు ఎలా వస్తాయో అధికారులకే తెలియాలన్నారు.ఇప్పటికైనా సమగ్ర విచారణ చెపట్టి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము న్యాయపరమైన పోరాటం చేస్తామని వారు తెలిపారు.

# గుర్తుతెలియని మగ మృతదేహం లభ్యం



**బనగానపల్లె,మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
మండలంలోని కైప గ్రామ ఊరి వెలుపల, బిజ్జి తిమ్మయ్య స్వామి సమీపంలో ప్లాట్లలో గుర్తుతెలియని మగ శవం లభ్యమైనట్లు నందివర్గం ఎస్సై బత్తుల భూపాలుడు తెలిపారు సోమవారం కైపా గ్రామ సమీపంలోని బిజ్జి తిమ్మయ్య స్వామి సమీపంలో వయస్సు సుమారు 30 నుండి 35 సంవత్సరంలో గల మగ శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9121101098, 9121101123 సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

# వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం



**బనగానపల్లె ,మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వణ అధికారి పాండురంగారెడ్డి , ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి ,పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి , అర్చకులు ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయకత్వంలోనే

# మైనారిటీల సంక్షేమం

మొదటి తరువాయి



పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రస్థాయితో పాటు, అన్ని జిల్లాలలో సాయంకాలం ఉపవాస దీక్ష విరమణ ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏ-కన్వెన్షన్ లో ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన ముస్లిం మైనారిటీలను ఉద్దేశించి మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రసంగించారు. రాష్ట్రం కోసం,రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని, ఈ ఘనత చంద్రబాబుకి దక్కుతుందని అన్నారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుకు రూ. 1.50కోట్లు నిధులు విడుదల చేసిన ఘనత కూడా చంద్రబాబుదే నని అన్నారు.

**మైనారిటీ కుటుంబాలకు అండగా “తల్లికి వందనం”**

రాష్ట్రంలో అమలవుతున్న తల్లికి వందనం పథకం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలు, శ్రామిక కుటుంబాల్లోని పిల్లల చదువుకు విశేషంగా లబ్ధి చేకూరుతోందని మదనపల్లెలో తనకు ఎదురైన ఒక ప్రత్యక్ష ఉదాహరణ అంశాన్ని మంత్రి ఫరూక్ సమావేశంలో వెల్లడించారు. ఏ ప్రభుత్వంలో మైనారిటీలకు మేలు జరిగిందన్న విషయాన్ని మైనారిటీలందరూ గుర్తించి గుండెల్లో పెట్టుకోవలసిన అవసరం ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. మదనపల్లెలో తాను ఒక సమావేశానికి హాజరు అయిన నేపథ్యంలో ఒక ముస్లిం వ్యక్తి వచ్చి తనకు దండ వేశారని, నాకెందుకు వేస్తున్నారని అడగగా.. తనకు 12 మంది పిల్లలు.. అందులో 6 మందికి తల్లికి వందనం మంజూరు అయిందని చెప్పి సంతోషం వ్యక్తం చేశారన్నారు. దీన్నిబట్టి తల్లికి వందనం పథకం తో మైనారిటీలు, పేదలు, శ్రామిక కుటుంబాలలోని పిల్లలకు ఎంత మేలు జరిగిందన్న విషయం, చదువుకు ఇచ్చిన ప్రాధాన్యత నెరవేరిందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని మంత్రి ఫరూక్ అన్నారు. ఏపీలో మైనారిటీల సంక్షేమం కోసం రూ. 6000 కోట్ల బడ్జెట్ ను కేటాయించిన ఘనత దేశం లోని ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ. 3000 కోట్లతో మైనారిటీల సంక్షేమం కు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నాంది పలికిన వ్యక్తి



చంద్రబాబు అని అన్నారు.

**గత ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమం సున్నా**

2019-2024 గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి ఒక్క పైసా ఖర్చు చేయలేదని, అభివృద్ధి సున్నా అని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ధ్వజమెత్తారు. టిడిపి ప్రభుత్వంలో 342 షాదిఖానాలు నిర్మించడం జరిగిందన్నారు. అయితే కేవలం రెండు షాదీఖానాలను మాత్రమే గత ప్రభుత్వం నిర్మించిందని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం విజయవాడలో హౌస్ కు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ కు, కడపలో హజ్ హౌస్ కు నిధులు కేటాయించి దాదాపుగా నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సొంత ఊరు పులివెందులలో కూడా షాది ఖానా నిర్మించలేదని, కడపలో హజ్ హౌస్, గుంటూరులో క్రిస్టియన్ భవన్ ల నిర్మాణాలను కూడా పట్టించుకోకుండా, పెండింగ్ పనులను పూర్తి చేయలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం, ఉపాధి కోసం ఆటోనగర్ లను ఏర్పాటు చేసి, భూములు కేటాయించిన ఘనత కూడా చంద్రబాబు దేన ని అన్నారు. నంద్యాల, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఆటోనగర్ లు చంద్రబాబు హయాంలోనే ఏర్పాటు అయిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలో 49,161 మంది



ఉపాధి కోసం రూ.280 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మైనారిటీ యువత శిక్షణ కోసం 41088 మందికి రూ. 53.89 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణకు ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. మైనారిటీలందరూ గుండె మీద చేయి వేసుకొని ఏ ప్రభుత్వమైతే తమ సంక్షేమానికి కృషి చేసిందో, ఆ ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. రంజాన్ కు ఒకరోజు ముందు హిందువుల పర్వదినం ఉగాది, మరుసటి రోజు రంజాన్ పర్వదినాల సందర్భంగా మత సామరస్యానికి ప్రతీకగా హిందువులు,ముస్లింలందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలను రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి


**బనగానపల్లె, మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు సత్య ప్రకాష్ ,కస్బా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వై సుంకన్న లు పేర్కొన్నారు సోమవారం పట్టణంలోని కస్బా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుంకన్న. యుటిఎఫ్ నంద్యాల జిల్లా సహాధ్యక్షులు కె సత్య ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను కాపాడండి - ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నంద్యాల జిల్లా సహాధ్యక్షులు కె సత్య ప్రకాష్ మాట్లాడుతూ2026-27 అకాడమిక్ సంవత్సరం జూన్ లో ప్రారంభమవుతుందని బడి ఈడు కలిగిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చాలన్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను



ప్రభుత్వ బడిలో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. చదువు ,సంస్కారం, నైతిక విలువలు, దేశభక్తి సమానత్వ భావన మొదలైన అంశాలను ప్రభుత్వ బడిలో ఉపాధ్యాయులు నేర్పిస్తారన్నారు. పిల్లలు ఉంటేనే ప్రభుత్వ బడి ఉంటుందని, ప్రభుత్వ బడి ఉంటేనే పేద, బడుగు ,బలహీన వర్గాల వారి పిల్లలకు విద్యాభ్యాసం అందుతుందన్నారు. ప్రభుత్వ బడిలో జట్టు తత్వాన్ని నేర్పిస్తారని, నీతి, నిజాయితీ కుల,మత ,బేధాలు లేకుండా అందరూ కలిసి ఉండే సమానత్వ భావాన్ని నేర్పిస్తుందని, భవిష్యత్తుకు భరోసానిచ్చేది ప్రభుత్వ బడి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాల లో పిల్లలను చేర్పించి ,మన బడి మనుగడ సాగేందుకు సహకరిద్దాం అని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ అబ్దుల్ కలీం, జక్కుల విజయ, దర్గా ముంతాజ్, నీలి మహేశ్వరమ్మ, ఎస్ ఎం సి చైర్మన్ పద్మావతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

**ఆళ్లగడ్డ మార్చి 16 డ్రీమ్ టైమ్స్:**
అలాగ నియోజకవర్గంలోని రుద్రవరం మండలంలోని ముత్తులూరు మెట్ట సమీపంలో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయని గ్రామస్థులు తెలిపారు. అహోబిలం వైపు నుంచి ఆళ్లగడ్డకు వస్తున్న కారు ముత్తలూరు మెట్ట సమీపంలో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. గాయపడిన వారిని 108 వాహనంలో ఆళ్ళగడ్డ ప్రభుత్వ హోస్పిటల్కి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారు తెలంగాణ వాసులుగా గుర్తించారు.



## బిజినెస్

# భారీగా తగ్గిన బంగారం ధరలు

## దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాలకు బ్రేక్.



దేశీయ స్టాక్ మార్కెట్‌ల లో వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. ఓ వైపు భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. బ్యాంకింగ్ , ఫైనాన్షియల్, ఆటో, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు, హార్ముజ్ జలసంధి దాటేందుకు భారత నౌకలకు అడ్డంకులు తొలగిపోవడం లాంటి కారణాలవల్ల సూచీలు సోమవారం భారీ లాభాల్లో ముగిశాయి.ఉదయం నష్టాల్లో మొదలైన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ కనిష్ఠాల నుంచి 1,550 పాయింట్ల మేర పుంజుకుంది. నిఫ్టీ సైతం ఇంట్రాడే కనిష్ఠాల నుంచి 2 శాతం మేర ఎగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, రిలయన్స్, ఎస్‌బీఐ వంటి అధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. వరుస నష్టాల వేళ ఆయా స్టాక్స్ కనిష్ఠాలకు చేరడంతో ఇదే అదునుగా మదుపర్లు కొనుగోళ్లకు ఉత్సాహం చూపించారు. సెన్సెక్స్ ఉదయం 74,415.79 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో లాభనష్టాల మధ్య కదలాడిన సూచీ.. ఆఖరి గంటలో భారీగా లాభపడింది. ఇంట్రాడేలో 75,805.27 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 938.93 పాయింట్ల లాభంతో 75,502.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 257.70 పాయింట్ల లాభంతో 23,408.80 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 92.42గా ఉంది. ఇక సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎటర్నల్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. బీఈఎల్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. బంగారం ఔన్సు 4,980 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.



మహిళలకు ఊహించని శుభవార్త అందుతోంది. బంగారం, వెండి ధరలు భారీగా పతనం అవుతున్నాయి. గత కొన్ని రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్న్త?న్న పసిడి ధరలు.. ఒక్కసారిగా దిగి వస్తున్నాయి. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ స్థాయిలో ధరలు తగ్గడం సామాన్య ప్రజలకు శుభవార్త అనే చెప్పాలి.తాజాగా తులం బంగారంపై భారీగా తగ్గింది. 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై ఏకంగా ఒక్క రోజులోనే రూ.2,240 తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాములపై 1640 వరకు దిగి వచ్చింది. అలాగే వెండిపై ఏకంగా రూ.5000 వరకు పతనమైంది.ధరలు తగ్గిన తర్వాత హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,420 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,300 వద్ద ఉంది. ఇక వెండి ధర తగ్గిన తర్వాత రూ.2,70,000 వద్ద స్థిరపడింది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,450 వద్ద ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,420 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,300 వద్ద ఉంది.అయితే బంగారం, వెండి ధరలు తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయి. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొంత తగ్గుముఖం పట్టడం, అమెరికా సెంట్రల్ బ్యాంక్ (ఫెడ్) వడ్డీ రేట్లపై తీసుకుంటున్న నిర్ణయాలు బంగారం ధరలపై ఎఫెక్ట్ చూపాయి. గత వారం రోజులుగా నిలకడగా పెరిగిన ధరల నేపథ్యంలో.. ఇన్వెస్టర్లు తమ దగ్గరున్న బంగారాన్ని అమ్మి లాభాలను గడించడం వల్ల మార్కెట్‌లో పెట్టుబడులు పెరిగి ధరలు తగ్గుముఖం పట్టాయి.

## భారత రోడ్లపైకి హోండా తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ నమూనా కారు..

హోండా కార్స్ ఇండియా తమ తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ జీరో ఆల్ఫా నమూనా కారును పరీక్షించనుంది. భారత రోడ్లపై ఈ నమూనా కారును పరుగులు తీయించి.. కీలక విషయాలు తెలుసుకునేందుకు కంపెనీ సిద్ధమవుతోంది. సోమవారం జీరో ఆల్ఫా పాన్ -ఇండియా రైడ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఈ కారును వచ్చే ఏడాదిలో మార్కెట్లోకి విడుదల చేయనున్నారని సమాచారం.ప్రముఖ కార్ల కంపెనీ హోండా కార్స్ ఇండియా తమ మొట్టమొదటి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ జీరో ఆల్ఫా పనితీరును పరీక్షించడానికి సిద్ధమైంది.




నిరుడు జపాన్ మొబిలిటీ షోలో జీరో ఆల్ఫా నమూనా కారును ప్రదర్శించిన హోండా ఈసారి భారతీయ రోడ్లపై నడిపి.. దాని సామర్థ్యం, పనితీరు వంటివి బేరీజు వేయనుంది. ఇందులో భాగంగానే రాజస్థాన్‌లోని తపకురా ప్లాంట్‌లో సోమవారం కంపెనీ ప్రతినిధులు జీరో ఆల్ఫా ప్రోటోటైప్ టెస్ట్ రైడ్‌ను ప్రారంభించారు. వైవిధ్యమైన భారతీయ రోడ్లపై ఈ కారును ఉరికిస్తూ.. దారిగుండా ప్రజల అభిప్రాయాలు సేకరించనున్నారు ఇంజనీర్లు.

# సంజూ శాంసన్ అత్యంత ప్రమాదకరమైన ఆటగాడు

**-టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడి**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ 2026 T20 ప్రపంచకప్‌లో టీమిండియాకు అత్యంత ప్రమాదకరమైన ఆటగాడిగా ఓపెనర్ సంజూ శాంసన్‌ను అభివర్ణించారు. సంజూ శాంసన్ తనదైన రోజున పవర్ ప్లేలో ప్రత్యర్థి జట్ల నుంచి మ్యాచ్‌ను లాగేసుకోగలడని గంభీర్ అన్నాడు. ఇండియా మూడోసారి T20 ప్రపంచకప్ నెగ్గడంలో సంజు కీలక పాత్ర పోషించాడని, అతని బ్యాట్ పవర్ పట్ల తమకు ఎప్పుడూ అనుమానం లేదని గంభీర్ ప్రశంసలు కురిపించాడు. తొలి ఆరు ఓవర్లలోనే జట్టుని గెలిపించే సత్తా సంజుకు ఉందని గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. వరల్డ్ కప్ తుది జట్టులో ముగ్గురు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఉన్నప్పటికీ, కేవలం కాంబినేషన్ మార్చడం కోసం కాకుండా జట్టులో మరింత దూకుడు పెంచేందుకే



శాంసన్‌ను ఎంపిక చేశామని ఆయన తెలిపారు. గత ఏడాదిన్నర కాలంగా జట్టులో వీలైనంత దూకుడుగా ఆడాలనే సిద్ధాంతంతో ఉన్నామని గంభీర్ పేర్కొన్నారు. అందుకే ఆఫ్ స్పిన్నర్‌కు కౌంటర్ ఇచ్చేందుకు కాకుండా, టాప్ ఆర్డర్ పవర్ పెంచేందుకు, పవర్ ప్లేలో మరింత దూకుడుగా ఆడేందుకే సంజును ఓపెనర్‌గా దింపామన్నారు. ఒక్కొక్కసారి సంజు జోరు మొదలైతే, ఆరు ఓవర్లలోనే మ్యాచ్‌ను నిలబెట్టగలడని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సంజు మెరుపు బ్యాటింగ్ శైలిపై తమకు ఎలాంటి సందేహాలు లేవని, అతను ఏం చేయగలడో తమకు బాగా తెలుసని గంభీర్ తెలిపారు. టాప్ ఆర్డర్‌లో చెలరేగిపోయే మరో బ్యాటర్ ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో నాకౌట్ సమయంలో శాంసన్‌ను తీసుకొచ్చామని గంభీర్ స్పష్టం చేశాడు. ఈ వ్యాఖ్యలు ఢిల్లీలోని ఐసీసీ వార్షిక అవార్డుల వేడుక కార్యక్రమంలో గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఇవి వైరల్‌గా మారాయి.

# గేల్ ఆల్‌టైమ్ రికార్డు బద్ధలు కొడతా

**రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ**

క్రికెట్ ప్రపంచంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరే మార్మోగిపోతుంది. రాజస్థాన్ రాయల్స్ జట్టులో అత్యంత పిన్న వయస్కుడిగా ఐపీఎల్ లోకి అడుగుపెట్టిన ఈ బీహార్ బుడ్డోడు, ఇప్పటికే తన విధ్వంసకర బ్యాటింగ్ తో అందరి దృష్టిని ఆకర్షించాడు. తాజాగా బీసీసీఐ నిర్వహించిన నమన్ అవార్డ్స్ వేడుకలో వైభవ్ సూర్యవంశీ ఒక సంచలన ప్రకటన చేశాడు. ఐపీఎల్ లో 13 ఏళ్లుగా ఎవరికీ సాధ్యం కాని క్రిస్ గేల్ 175 పరుగుల రికార్డును తాను ఈ ఐపీఎల్ 2026 సీజన్ లో బద్దలు కొడతానని ధీమా వ్యక్తం చేశాడు. గత ఏడాది ఐపీఎల్ 2025లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్ సూర్యవంశీ, అదే ఊపును 2026 అండర్-19 వరల్డ్ కప్ లోనూ కొనసాగించాడు. ఇంగ్లాండ్ తో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 80 బంతుల్లోనే 175




పరుగులు చేసి భారత్ కు ఆరోసారి టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు అదే మ్యాజిక్ ను ఐపీఎల్ స్టేజ్ పై రిపీట్ చేయాలని వైభవ్ భావిస్తున్నాడు. ఆరు సిక్సర్లు కొట్టడం లేదా ఫాస్టెస్ట్ సెంచరీ చేయడం కంటే, గేల్ నెలకొల్పిన అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును అధిగమించడమే తన ప్రధాన లక్ష్యమని ఈ యువ సెన్సేషన్ స్పష్టం చేశాడు. వైభవ్ సూర్యవంశీ తన ఖాతాలో ఇప్పటికే అనేక అరుదైన రికార్డులను వేసుకున్నాడు. ఐపీఎల్ లో సెంచరీ బాదిన అతి పిన్న వయస్కుడిగా, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సెంచరీ చేసిన యువకుడిగా అతను చరిత్ర సృష్టించాడు. 2013లో పూణే వారియర్స్ పై క్రిస్ గేల్ చిన్నస్వామి స్టేడియంలో చేసిన 175 పరుగుల రికార్డు ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయలేకపోయారు. కానీ, వైభవ్ క్రీజులో ఉంటే ఆ రికార్డు ప్రమాదంలో ఉన్నట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజస్థాన్ రాయల్స్ తరఫున మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగే మ్యాచ్ లో వైభవ్ తన ఐపీఎల్ 2026 ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు.

## స్పోర్ట్స్

## ఆర్‌సీబీకి పెద్ద ఉపశమనం




ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కు పెద్ద ఉపశమనం లభించింది. బెంగళూరులో చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ స్టేడియంలోని భద్రత, సంసిద్ధత చర్యలను పరిశీలించి క్లీన్ చీట్ ఇచ్చింది. దాంతో కర్ణాటక ప్రభుత్వం మ్యాచ్‌లు నిర్వహించేందుకు అనుమతిచ్చింది. సోమవారం విధాన సౌధలో హోం మంత్రి జి పరమేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దాంతో ఆర్‌సీబీ హోమ్ మ్యాచ్‌లు చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్‌సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో 5 మ్యాచ్‌లు ఆడనుంది. తన రెండో హోమ్ గ్రౌండ్‌గా రాయ్‌పుర్‌లోని షహీద్ వీర్ నారాయణ సింగ్ స్టేడియాన్ని ఎంచుకున్న ఆర్‌సీబీ.. అక్కడ రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది.ఐపీఎల్‌లో ఒక ప్లే ఆఫ్ మ్యాచ్, ఫైనల్ కూడా బెంగళూరులో నిర్వహించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. గతేడాది ఆర్‌సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటనపై సీరియస్ అయిన ప్రభుత్వం.. జస్టిస్ కున్హా సారథ్యంలోని కమిటీతో విచారణ జరిపించింది. ఆ కమిటీ సూచనల మేరకు కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో భద్రతా చర్యలు చేపట్టింది. తొక్కిసలాట వంటి ఘటనలు పునరావృతం కాకుండా చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా 35 వేల మంది ప్రేక్షకులకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. అలాగే చివరి నిమిషంలో రద్దీని నివారించడానికి మ్యాచ్‌కు ముందు 3, 4 గంటల ముందే స్టేడియం గేట్లను తెరవనున్నారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ భాగస్వామ్యంతో టికెట్ కలిగి ఉన్న ప్రేక్షకులకు మెట్రోలో ఉచిత ప్రయాణ వసతి కల్పించనున్నారు.




## సల్మాన్ ఖాన్ బ్యాటిల్ ఆఫ్ గల్వాన్‌కు 'మాతృభూమి' టైటిల్..

### ఇంతకీ పేరు ఎందుకు మార్చారో..?


బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. అపూర్వ లాఖియా దర్శకత్వంలో భారతదేశం-చైనా సరిహద్దులో 2020లో జరిగిన గల్వాన్ లోయ సంఘటన ఆధారంగా వార్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రంలో బాలీవుడ్ భామ చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. రిలీజ్ టైం దగ్గర పడుతున్న క్రమంలో ఈ ప్రాజెక్ట్ ఊహించని నిర్ణయంతో వార్తల్లో నిలిచింది.ఈ మూవీ టైటిల్‌ను బ్యాటిల్ ఆఫ్ గాల్వన్ నుంచి 'మాతృభూమి'గా మార్చారు. కొత్త టైటిల్‌తో డిజైన్ చేసిన పోస్టర్‌ను కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేశారు మేకర్స్. అయితే అనూహ్యంగా చేసిన టైటిల్ మార్పు ఇంతకీ కారణమే ఉంటుందా..? అని అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాటీ పెంచుతోంది. ఈ మూవీ టీజర్ విడుదలైన తర్వాత ఈ చిత్రంలో గాల్వన్ యుద్ధానికి సంబంధించి వాస్తవాలను వక్రీకరిస్తున్నారంటూ చైనీస్ స్టేట్ రన్ చేస్తున్న మీడియా కొత్త వివాదానికి తెరలేపింది. అయితే దీనిని భారత ప్రభుత్వ నిషేధంగా కంటే కూడా బాహ్యంగా రాజకీయ ఎదురుదెబ్బగా భారత నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో తాజాగా సల్మాన్ ఖాన్ అండ్ టీం తీసుకున్న టైటిల్ మార్పుతో ఇక వివాదానికి ముగింపు పడ్డట్టేనని.. ఒరిజినల్ టైటిల్‌పై వచ్చిన అభ్యంతరాల ఫలితంగా మేకర్స్ ఇలాంటి నిర్ణయం తీసుకుందని కొత్త పోస్టర్‌తో క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. ఈ మూవీలో సల్మాన్ ఖాన్ తెలంగాణకు చెందిన వీర సైనికుడు, గల్వాన్ వీరుడు కల్నల్ సంతోష్ బాబు పాత్రలో కనిపించబోతున్నట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. కాగా దీనిపై మేకర్స్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. సల్మాన్ ఖాన్, చిత్రాంగద సింగ్ కాంబోలో వస్తోన్న తొలి సినిమా ఇది.



## ఫస్ట్ డే షూట్‌లో పవన్ కల్యాణ్ నన్ను అడిగిన ప్రశ్న అదే

### ఉస్తాద్ భగత్ సింగ్ బ్యూటీ రాశీఖన్నా

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా రాశీఖన్నా మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది.పవన్ కల్యాణ్ సినిమా అని తెలియగానే చాలా ఎక్జయిట్‌మెంట్‌తో కథ వినకముందే సినిమాకు ఒకే చెప్పానంది రాశీఖన్నా. నా తొలి సినిమా నుంచి పవన్ కల్యాణ్ స్టార్‌డమ్ గురించి, పవనిజం గురించి చాలా వింటున్నా. అప్పటి నుంచి ఆయనతో ఒక్కసారైనా నటించాలని అనుకునేదాన్ని. ఉస్తాద్ భగత్ సింగ్‌తో నా కల నెరవేరింది. ఇందులో నేను శ్లోక అనే మోడ్రన్ యువతి పాత్రలో కనిపిస్తా. నాతోపాటు ప్రతీ పాత్ర కథలో చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఇందులో నేను మాస్ సాంగ్‌లో కనిపిస్తా. ఆ పాటకు డ్యాన్స్ చేయడాన్ని, షూటింగ్‌ను చాలా బాగా ఎంజాయ్ చేశానంటూ చెప్పుకొచ్చింది. పవన్ కల్యాణ్ సాదాసీదాగా ఉండే వ్యక్తి. ఎప్పుడూ బుక్స్ చదువుతుంటారు. ఆయన తొలి రోజు షూటింగ్‌లో మీరు నటి అవ్వాలనుకున్నారా..? అని నన్ను అడిగారు. నిజానికి తాను ఐఏఎస్ ఆఫీసర్ అవుదామనుకున్నానని ఆయనతో చెప్పాను. పవన్ కల్యాణ్ తక్కువగా మాట్లాడుతారు.. కానీ ఆయన ప్రతీ మాటకు ఒక విలువ ఉంటుంది. ఆయన ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తుంటారంది రాశీఖన్నా. హరీష్ శంకర్‌కు మాస్ ఆడియెన్స్ పల్స్ చాలా బాగా తెలుసు. నిద్ర లేకుండా అవిశ్రాంతంగా సినిమా కోసం పనిచేశారు. 120 రోజుల్లో చేయాల్సిన షూటింగ్‌ను 40 రోజుల్లోనే పూర్తి చేశారు. సెట్స్‌లో తరచూ పంచ్ డైలాగ్స్ రాసేవారు. ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని చెప్పింది రాశీఖన్నా. ఇప్పుడీ కామెంట్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ మూవీలో పార్థిబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు.




## నేను చేయాల్సిన సినిమా ఆమె చేసి బ్లాక్ బస్టర్ అందుకుంది

అందాల రాక్షసి సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది అందాల భామ లావణ్య త్రిపాఠి. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆ సినిమాలో క్యూట్ పర్ఫామెన్స్ తో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసినా లావణ్యకు చెప్పుకోదగ్గ హిట్ మాత్రం పడలేదు. కానీ టాలీవుడ్ లో యంగ్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ఇక ఈ అమ్మడు మెగా హీరోవరుణ్ తేజ్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.. ఈ ఇద్దరూ కలిసి రెండు సినిమాల్లో నటించారు. అదే సమయంలో ప్రేమలో పడటంతో పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు లావణ్య, వరుణ్.ఈ జంటకు ఓ కొడుకుకూడా ఉన్నాడు. పెళ్లి తర్వాత లావణ్య సినిమాలు కంటిన్యూ చేస్తుంది. అయితే ఇంతకు ముందులా కాకుండా ఇప్పుడు ఆచితూచి సినిమాలు చేస్తుంది. ఇటీవలే ఓటీటీ కోసం ఓ సినిమా చేసింది లావణ్య. ఇదిలా ఉంటే లావణ్య ఓ బ్లాక్ బస్టర్ సినిమాను మిస్ చేసుకుందట. ఇటీవల లావణ్య త్రిపాఠి వరుసగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటుంది. అలాగే ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. కెరీర్ లో మిస్ చేసుకున్న బిగ్ బ్లాక్ బస్టర్ సినిమా ఏదైనా ఉందా అన్న ప్రశ్నకు ఆసక్తికర సమాధానం చెప్పింది.ఓ సినిమా ఆఫర్ వచ్చినప్పుడు కథ వినకుండానే నో చెప్పా.. అయితే ఆతర్వాత కథ తెలిసినప్పుడు సినిమా చేయాలని ఆశపడ్డా.. కానీ అప్పటికే అవకాశం చేజారిపోయిందని తెలిపింది. ఆతర్వాత ఆ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యిందని తెలిపింది లావణ్య. ఆ సినిమా ఏదో కాదు. విజయ్ దేవరకొండ, రష్మిక కలిసి నటించిన గీత గోవిందం. ఈ సినిమాలో ముందుగా హీరోయిన్ పాత్ర కోసం లావణ్యను సంప్రదించారట.. కొన్ని కారణాల వల్ల ఆమె నో చెప్పడంతో రష్మిక మందన్న ఆ ఛాన్స్ అందుకుందట. ఇక గీత గోవిందం సినిమాతో ఫ్రెండ్స్ గా మారిన విజయ్, రష్మిక ప్రేమలో పడి ఇటీవలే పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు.



## నమో నమో నారాయణే..

ప్రసిద్ధ దేవాలయాలు, నేలమాళిగలు, నిధి నిక్షేపాలు.. తదితర అంశాల మేళవింపుగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా 'నమోరే.. నమో నమోరే.. నమో నమో నారాయణే..' అంటూ సాగే భక్తిరసాత్మక గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. ఆధ్యాత్మికత, కళాత్మకత ప్రతిబింబించేలా ఈ పాట రూపొందింది. విష్ణుదేవుని స్తుతిగా తయారైన ఈ గీతాన్ని శ్రీహర్ష ఈమని రాయగా, జునైద్‌కుమార్, అభే స్వరపరిచారు. సింధూజా శ్రీనివాసన్, ఐశ్వర్య దారూరి ఆలపించారు. గణేశ్ ఆచార్య, శ్రేష్టి వర్మ కొరియోగ్రఫీ అందించారు. రెండువేలమంది నర్తకీమణులు ఈ పాటలో భాగమయ్యారు. నభా నటేష్, దక్ష నగార్కర్ హావభావాలు, నాట్యవిన్యాసాలు పాటకు ఆకర్షణగా నిలిచాయి. తిరువనంతపురం పద్మనాభస్వామి ఆలయాన్ని తలపించేలా కళాదర్శకుడు అశోక్‌కుమార్ వేసిన సెట్ పాటకు నిండుదనాన్ని తెచ్చింది. ఈ చిత్రానికి నిర్మాణం: చీ×ఖ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831